ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు
జిల్లా వార్తలు
5
ఆదివారం 16 మార్చి 2025


● వెంకటపాలెంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న వేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం


మంగళసూత్రాన్ని చూపిస్తున్న వేద పండితులు

అమరావతి ఆధ్యాత్మిక నగరి

- అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం
- గోవిందనామస్మరణతో మార్మోగిన వెంకటపాలెం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు
- కల్యాణోత్సవానికి గవర్నర్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు రాజధాని వాసులు హాజరు

గోవింద నామస్మరణలు.. అన్నమయ్య సంకీర్తనలతో భక్తుల తన్మయత్వం.. భక్తుల కోలాటాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రాజధాని అమరావతి ఆధ్యాత్మికనగరంగా మారిపోయింది. విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా వెలుగులీనుతుండగా రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి సప్త ద్వారాలు, ఆనంద నిలయంతో వైకుంఠాన్ని తలపించేలా టీటీడీ కల్యాణ వేదిక ఏర్పాటు చేయగా రంగు రంగుల పుష్పాలు, ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితుల ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరగ్గా ఆహుతులు తిలకించి పరమానందభరితులయ్యారు.

తుళ్లూరు, గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవింద.. ఏడుకొండల వాడా వేంకటరమణా గోవిందా.. అంటూ భక్తులు వెంకన్న నామాలను స్మరిస్తుండగా.. అత్యద్భుత అలంకరణలతో ఇల వైకుంఠం తిరుమలను రాజధాని అమరావతిలో ప్రతిష్ఠించారా అన్నట్లు జరిగిన ఏర్పాట్లు, అలంకరణల మధ్య వెంకటపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో ఆ దేవ దేవుడి కల్యాణ మహోత్సవం అమరావతి రాజధానిలో తొలిసారి అంగరంగ వైభవంగా జరిగిం ది. అన్నమాచార్య సంకీర్తనలు, వేద మంత్రోచ్చరణల మధ్య శ్రీనివాసుడి కల్యాణం రాజధాని ప్రజలకు కొత్త అనుభూతిని పంచిపెట్టింది. శ్రీవారి కల్యాణ వేదిక విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా విరాజిల్లింది. కల్యాణోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆద్యంతం భక్తి భావంతో తన్మయత్వం పొందారు. తొలుత ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంగళవాయిద్యాల నడుమ సతీసమేతంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ నజీర్‌తో కలసి ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు పట్టు వస్త్రాలు తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ వేదపండితులు కల్యాణ వేడుక కైంకర్యాలను నిర్వహించారు. చివరగా కర్పూర హారతి, నక్షత్ర హారతి, మహా హారతితో కల్యాణోత్సవం అత్యంత ఘనంగా ముగిసింది. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, కొల్లు రవీంద్ర, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, టీటీడీ ఈవో శ్యామల రావు, ఏఈవో వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, తమ్మిశెట్టి జానకీదేవి, ఎంఎస్ రాజు, భానుప్రకాశ్, కలెక్టర్ నాగలక్ష్మి అమరావతిలోని వివిధ గ్రామాల ప్రజలు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.


స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న ప్రజలు




స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు




కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

ప్లాస్టిక్.. ప్రమాదకరం

- పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ అరుణ్‌బాబు
- నెమలిపురి గ్రామంలో రోడ్లను శుభ్రం చేసిన కలెక్టర్

రాజుపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'ప్లాస్టిక్ కవరు తయారీకి పది సెకన్లు పడుతుంది. అది భూమిలో కరిగిపోవడానికి వందల ఏళ్లు పడుతుంది. పర్యావరణంతో పాటు జనజీవాలకు హానికరమైన ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలి.' అని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మూడో శనివారం మండలంలోని నెమలిపురిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రోడ్లను చీపురుతో శుభ్రం చేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరుకులు తెచ్చుకోవడానికి క్లాత్ కవర్లను వాడుకోవాలన్నారు. పరిసరాలు బాగుంటే.. గ్రామాలు బాగుంటాయని, తద్వారా ఆరోగ్యకరంగా ఉండి ఆర్థికంగా అభివృద్ధి చెందుతామన్నారు. ఆరోగ్యం బాగోలేకపోతే ఎంత సంపాదించినా ఫలితం ఉండదన్నారు. అనంతరం ప్లాస్టిక్‌ను నిర్మూలించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీవో బాస్కరరెడ్డి, మండల ప్రత్యేక అధికారి రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దారు దుర్గేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజుతో పాటు గుత్తా వెంకట్రావు, గంగవరపు రామలక్ష్మణరావు, శనగపూల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.


నెమలిపురి గ్రామంలో చీపురి పట్టుకుని రహదారిపై ఊడుస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం

పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకుని ఏడాదైనా మంజూరైందా లేదా అన్న విషయం చెప్పడంలేదని నెమలిపురి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు దూదేకుల అలిమ్‌మాబీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌ను పిలిచి ప్రశ్నించగా పొంతన లేకుండా సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో..

నరసరావుపేట కల్చరల్: కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ సిబ్బందితో కలిసి ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం సిబ్బంది చేత స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కార్మికులకు జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ సూరజ్, ఆర్డీవో మధులత, కమిషనర్ జస్వంత్‌రావు పాల్గొన్నారు.

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

- 82 మందికి 13 మంది జడ్పీటీసీలే హాజరు
- కోరం లేకపోవడంతో వాయిదా వేసిన చైర్‌పర్సన్
- ఆమోదానికి నోచుకోని బడ్జెట్.. ఏప్రిల్ నుంచి తిప్పలే
- వైసీపీ జడ్పీటీసీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- క్రిస్టినా టీడీపీలో చేరినప్పటి నుంచి సహాయ నిరాకరణ

గుంటూరు సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జగన్ అసెంబ్లీకి పోవడంలేదు.. తాము మాత్రం జడ్పీ సమావేశానికి ఎందుకు వెళ్లాలి.. అనుకున్నారో ఏమో జడ్పీటీసీలు శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపులో కీలకమైన సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీలు బహిష్కరించారు. జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ఒకటో స్థాయి సంఘ సమావేశం ప్రారంభం కాగా జడ్పీ టీసీలు ఆలస్యంగా వచ్చారు. అయితే కోరం సరిపోవడంతో సమావేశాన్ని నిర్వహించారు. మిగిలిన స్థాయి (మిగతా 8వ పేజీలో)

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.23 (ఆదివారం సాయంత్రం)
సహరి : 4.58 సోమవారం ఉదయం


సమావేశం నుంచి వెళ్లిపోతున్న జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

ప్రభుత్వాస్పత్రిలో ప్యాప్-డీ సెంటర్ ఏర్పాటు

● రాష్ట్రంలో ఈ తరహా కేంద్రం ఇదే మొదటిసారి

గుంటూరు మెడికల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఓపీ విభాగంలో.. ఔషధాలు వాడే విధానంపై రోగులకు అవగాహన కల్పించేందుకు శనివారం కొత్తగా ప్యాప్-డీ సెంటర్‌ను (పేషెంట్ ఏవేర్‌నెస్ ఆన్ ప్రిస్క్రైబ్డ్ డ్రగ్స్) ప్రారంభించారు. ఆసుపత్రి ఓపీ విభాగంలో ఆరవ నెంబర్ వార్డులో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక కార్పొరేటర్ పోతురాజు సమతతో కలసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగానికి అనుబంధంగా పని చేసే ఈ కేంద్రంలో ఫార్మసిస్టులు, మందులు వాడే విధానం రోగులకు వివరిస్తారు. ఈ సందర్భంగా గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యబోధన ఆసుపత్రుల్లో తొలిసారిగా గుంటూరు జీజీహెచ్‌లో ప్యాప్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోగులు ఒకే మందును పలుసార్లు తీసుకోకుండా నివారిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందచారాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ సాల్మన్‌రాజు, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బీ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్యాప్‌డీ సెంటర్ ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి

నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

◆ సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రక్ ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

◆ అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి ◆ మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

వేమూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై అతి వేగంతో వెళుతూ.. ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన వేమూరు-తెనాలి ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన బత్తిభట్ల శ్రీధర్ (28) గుంటూరు మంగళదాస్ నగర్‌కు చెందిన తోట సోముకుమార్‌లు ద్విచక్ర వాహనంపై కొల్లూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. వాహనాన్ని నడుపుతున్న శ్రీధర్ అతి వేగంతో నడపడంతో పాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న టాటా ఏసీని ఢీకొట్టాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో శ్రీధర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోముకుమార్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన చోటు చేసుకోగానే సమీపంలోని వ్యక్తులు 108 వాహనానికి ఫోన్ చేయగా రెండు గంటల వరకు అందుబాటులోకి రాకపోవడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన శ్రీధర్‌ను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయాలపాలైన సోముకుమార్‌ను చికిత్స నిమిత్తంగా ఆటోలో తెనాలి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

మధ్యవర్తిత్వంతోనే వివాదాల పరిష్కారం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

పెదకాకాని, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోర్టు గుమ్మం తొక్కకుండానే ప్రత్యామ్నాయ విధానాల ద్వారా వివాదాల పరిష్కారం చౌకగా, సత్వర న్యాయం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏషియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సంస్థతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ చీమలపాటి రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులందరూ వీలైనంతవరకు స్నేహపూర్వకమైన విధానాల ద్వారా ముఖ్యంగా చట్టప్రకారమైన ఆర్బిట్రేషన్ అనగా మధ్యవర్తిత్వపు పద్ధతిలో కోర్టు వెలుపల వివాదాలను పరిష్కరించుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించారు. న్యాయ విద్యార్థులు అన్ని రంగాల వలే వారి రంగంలో కూడా నూరు శాతం విజయం సాధించే అవకాశాలు ఉన్నాయన్నారు. అయితే క్రమశిక్షణ, సహనం వంటి లక్షణాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజల్లో నిజాయితీ, సోదర భావాలు ఉండటం కారణంగా గ్రామ పెద్దల తీర్పులతో వివాదాలు సత్వరమే పరిష్కారం అయ్యేవన్న సంగతిని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు మారిన కాలమానం ప్రకారం మనలో కోరికలు అధికమై అహంతో ప్రతిదీ లిటిగేషన్‌కే ప్రాధాన్యమిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పరిష్కారం కానీ కేసుల సంఖ్య ఐదు కోట్లను దాటిపోవడం మనందరినీ భయభ్రాంతులకు గురి చేసే విషయంగా చెప్పుకొచ్చారు. గౌరవ అతిథి సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ఆర్.శాంతన కృష్ణన్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవిద్యలో ఆర్బిట్రేషన్‌ను ఒక సబ్జెక్టుగా తీసుకువచ్చి ఈ సమాజానికి ఎంతో మేలు చేస్తుందని కొనియాడారు. అయితే కేంద్రం మీడియేషన్ చట్టాన్ని 2023లో తీసుకువచ్చినప్పటికీ అమలుకు శ్రీకారం చుట్టుకపోవడం ఎంతో విచారకరమని అభిప్రాయపడ్డారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు మాట్లాడుతూ తమ తాతల కాలంలో రచ్చబండ విధానంలో ముత్తాత మరియు తాత ఆ గ్రామస్తుల వివాదాలని పరిష్కరిస్తుంటే తద్వారా తన కుటుంబానికి దక్కిన కీర్తిని అనుభవిస్తూ తాము చాలా గర్వించేవారమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీఐఏఎం కో ఫౌండర్ డాక్టర్ సూర్యరాజు, వర్సిటీ రిజిస్ట్రార్‌లు న్యాయ విద్యార్థుల ఇంటర్న్ షిప్‌కు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, కార్య శిబిరం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్.ఎల్ జయశ్రీ, హైకోర్టు న్యాయవాది, వర్సిటీ లీగల్ అడ్వైజర్ నర్రా శ్రీనివాసు, డాక్టర్ పీ వెంకటరమణ, డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఘంటా సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, బి.వి.చెన్నారావు, పరుచూరు కుమారి, ఆంగ్ల అధ్యాపకులు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ అభిలాష్ గోపీనాథన్, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజ్ ప్రిన్సిపాల్ నటరాజ్, వర్సిటీ, అనుబంధ కళాశాలల న్యాయ విద్యార్థులు, వివిధ జిల్లాల బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి

పిన్నెల్లి అనుచరులే భూకబ్జాదారులు : ఎమ్మెల్యే జూలకంటి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో పిన్నెల్లి కుటుంబం, ఆయన అనుచరులు వేల ఎకరాలను కబ్జా చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారులో ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అరాచక పాలనలో ఎందరో తమ విలువైన భూములను కోల్పోయారని, వాటిపై సమగ్ర విచారణ జరిపి కబ్జాకోరులను జైలుకు పంపి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కులాలను రెచ్చగొట్టేలా రాజకీయాలు చేస్తే తాట తీస్తామని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. తాజాగా మాచర్ల పట్టణంలో రెండు కులాల మధ్య జరిగిన గొడవను రాజకీయంగా ఉపయోగించుకోవాలని వైసీపీ చూడడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాను నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు కబ్జాకోరులు రావద్దని, బాధితుల కోసమే ఈ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాదర్బార్‌కు 50కుపైగా వినతులు వచ్చాయి. రెవెన్యూ, భూకబ్జాలు, పింఛన్లు, సీఎం రిలీఫండ్ వంటి అనేక సమస్యలపై ప్రజలు తమ అర్జీలు ద్వారా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి విన్నవించారు. తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల జూనియర్ కళాశాలలో
అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోస్తా ఆంధ్రాలోని ముస్లిం మైనార్టీ విద్యార్థులకు గుంటూరులో ఏర్పాటు చేసిన గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీ సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్‌జేసీసెట్ ద్వారా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఇందులో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40, సీఈసీలో 35 సీట్లు ఉంటాయని తెలిపారు. మైనార్టీ ముస్లిం విద్యార్థులతోపాటు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఒక్కో గ్రూపులో రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఉంటాయని తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న వారు https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8712625073, 9652569140లో సంప్రదించాలని సూచించారు.

నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ మౌలాలి బైపాసు నుంచే రూటుమార్పు

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వారంలో రెండు రోజులు గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ని మౌలాలి బైపాసు నుంచే రూటుమార్పి నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17231 నరసపూర్ - నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 28వ తేదీ నుంచి చర్లపల్లికి రాత్రి 8.30కి చేరుకొని 8.40కి బయలుదేరుతుంది. ఈ రైలు సికింద్రాబాద్‌కు వెళ్లకుండా మౌలాలి బైపాసు రూట్ నుంచి కామారెడ్డి మీదగా మరుసటి రోజు ఉదయం 9.45కి నాగర్‌సోల్ చేరుకొంటుంది. నంబరు. 17232 నాగర్‌సోల్ - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి సికింద్రాబాద్‌కు కాకుండా చర్లపల్లికి రాత్రి 11.45కి చేరుకొని 11.55కు బయలుదేరుతుందన్నారు.

సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లాలి

● ఐకార్, ఐఏఆర్ఐ డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు

గుంటూరు(విద్య),మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో అభివృద్ధి అయిన సాంకేతికతను వ్యవహారికంగా రైతుల వద్దకు తీసుకెళ్లాలని న్యూఢిల్లీలోని ఐకార్, ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ రిలేషన్స్‌ల ఆధ్వర్యంలో "అకడమియా ఇండస్ట్రీ ఫార్మర్ పార్టనర్‌షిప్స్ కాన్‌క్లేవ్"ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ ఐఐఓపీఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్)ల మధ్య అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ పెదవేగిలోని ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కే సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమానికి అనేక విద్యాసంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు కూడా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆలపాటి సత్యనారాయణ, హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీ తారా సత్యవతి, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్, చెరుకుమల్లి శ్రీనివాసరావు

రెండు వర్గాల మధ్య ఘర్షణ..
13 మంది అరెస్టు.. 14 రోజుల రిమాండ్

మాచర్లటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నమోదైన కేసుల్లో పట్టణ పోలీసులు ఇరువర్గాలకు చెందిన 13 మందిని శుక్రవారం అరెస్టు చేశారు. వారిలో ముగ్గురు మైనర్లు ఉండడంతో వారిని విజయవాడలోని జువైనల్ కోర్టుకు పంపారు. మిగిలిన పది మందిని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో స్థానిక తహసీల్దార్ కిరణ్‌కుమార్ వద్ద శనివారం హాజరుపరిచారు. కిరణ్‌కుమార్ వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. వీరిలో ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యాయత్నం, మరికొన్ని కేసులు కూడా నమోదు చేశారు. మిగిలిన వారిపై హత్యాయత్నం కేసు, మరికొన్ని కొట్లాట కేసులు నమోదు చేశారు. వీరందరిని పోలీసు బందోబస్తు మధ్య గురజాల సబ్‌జైల్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఎన్ఎస్పీ ఏఈఈ మృతి

బొల్లాపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం రమణయ్య(52) మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. రమణయ్య గుంట్లపల్లి ఎన్ఎస్పీ కాలువ ఏఈగా పని చేస్తున్నారు. విధులు నిర్వహించుకుని తిరిగి వస్తుండగా శుక్రవారం రాత్రి ట్రాక్టర్‌ను ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం వినుకొండ తరలించగా మృతిచెందాడు. మృతునికి భార్య హనుమాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీఎం చంద్రబాబు
రాజకీయ జీవితం ఆదర్శనీయం

● ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య



మంగళగిరి సిటీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయాలను ప్రజలందరికీ సమానంగా అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. ఎమ్మెల్యేగా సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి శనివారంతో 47 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేగా 41 ఏళ్లు, ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్నారని చెప్పారు. ఈ రికార్డు ఏపీ చరిత్రలోనే ప్రథమ స్థానమన్నారు. విజన్-2020 నిజమై లక్షలాది ఉద్యోగాలు కల్పించిందని, సంపద సృష్టించిందని తెలిపారు. నేడు స్వర్ణాంధ్ర విజన్-2047తో పౌరుల తలసరి ఆదాయం రూ.35 లక్షలకు పెంచేందుకు అహర్నిశం కృషి జరుగుతుందని చెప్పారు. సామాజిక న్యాయానికి మారుపేరు చంద్రబాబు అన్నారు. విద్య, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల కల్పన, డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. నాడు దీపం-1 పథకం ద్వారా 65 లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు దీపం-2 ద్వారా 93 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారని చెప్పారు. పాడి పరిశ్రమలో, ఐటీలో అధిక శాతం మంది మహిళలు ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారంటే అది చంద్రబాబు కృషేనన్నారు. ఏజెన్సీల్లో జగన్ గంజాయి మొక్కలు పెంచితే... చంద్రబాబు కాఫీ తోటలు పెంచారని, అరకు కాఫీని ప్రపంచ వ్యాపితం చేశారని అబద్దయ్య తెలిపారు.

ఏడాది ముందుగానే
కావటి రాజీనామా

రేపటికి మేయర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు

కమిషనర్, కూటమి నేతలపై ఆరోపణలు, విమర్శలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ మనోహర్‌నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మికి అందజేస్తున్నట్లు ఆయన శనివారం తెలిపారు. గుంటూరు సంపత్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందంటూ కూటమి నాయకులపై ధ్వజమెత్తారు. కమిషనర్ పులి శ్రీనివాస్‌పై ఆరోపణలు చేశారు. నాలుగేళ్ల నగర మేయర్‌గా పనిచేసిన కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజీనామా చేస్తున్న క్రమంలో కన్నీటి పర్యంతమయ్యారు. జగన్ వెంట ఉంటానని తెలిపారు.

ఓటమి భయంతోనే..

మనోహర్‌నాయుడు మేయర్‌గా బాధ్యతలు చేపట్టి ఈ నెల 17వ తేదీకి నాలుగేళ్లు పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో 18న అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి నేతలు రంగం సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ముందే తెలుసుకున్న మనోహర్‌నాయుడు ఓటమి భయంతో పదవికి రాజీనామా చేశారని తెలుస్తోంది. నాలుగేళ్ల తర్వాత అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ఎన్నికల నియమావళి ప్రకారం అవకాశం ఉన్నది. ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరు స్థానాలను కూటమి తరపున కార్పొరేటర్లు కైవసం చేసుకున్నారు. అప్పటి నుంచి మేయర్ పీఠాన్ని హస్తగతం చేసుకునేందుకు కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. ఈ క్రమంలోనే కావటి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో మూడు పర్యాయాలు కార్పొరేటర్‌గా ఆయన పని చేశారు. 2021లో జరిగిన ఎన్నికలలో కార్పొరేటర్‌గా గెలుపొందిన ఆయన మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి నాలుగేళ్లు గుంటూరు మేయర్‌గా వ్యవహరించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 519.50 అడుగులు ఉంది. ఇది 148.36 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8454 క్యూసెక్కులు, ఎస్ఎ ల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,277 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	91, 99, 110
చికెన్ విత్ స్కిన్(కిలో)	176.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	186.00

నేడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ

మాచర్లటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటేశ్వర హాలు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నారు. ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుబాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం తదితరులు హాజరుకానున్నారు.

నేడు శివలింగ పునఃప్రతిష్ఠ

● ఎంపీ, ఎమ్మెల్యేలు, పీఠాధిపతులు రాక

దాచేపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 12వ శతాబ్దంలో పల్నాటి నాయకురాలు నాగమ్మచే నిర్మించబడి కాలక్రమంలో శిథిలావస్థకు గురైన ఆలయంలో నూతనంగా శ్రీపార్వతీ దేవి సమేత చెన్న మల్లికార్జునస్వామి లింగాకార ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం జరగనున్నది. ఆదివారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఇతర టీడీపీ బోర్డు చైర్మన్లు, మెంబర్లు, వివిధ హోదాల్లో ఉన్న అధికారులు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి పర్యవేక్షణలో తాళ్లాయపాలెం కోటి లింగాల క్షేత్ర పీఠాధిపతి శివస్వామి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం ప్రతిష్ఠా మూలమూర్తుల గ్రామోత్సవం, నవగ్రహ ఆరాధన, మహాశాంతి హోమం నిర్వహించారు. 12వ శతాబ్దంలో నాయకురాలు నాగమ్మచే పూజలు అందుకున్న శివాలయం పునఃప్రతిష్ఠించడం ఓ చారిత్రక ఘట్టంగా టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి వివరించారు. ప్రముఖులు రానుండటంతో పోలీసు శాఖ కూడా భద్రతా చర్యలు తీసుకుంది.

తలనీలాల సేకరణకు 18న వేలం

గురజాలటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద తలనీలాలు పోగు చేసుకునే హక్కునకు ఈనెల 18వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు దరావత్తు కింద రూ.50 వేలు చెల్లించాలన్నారు. వివరాలకు దేవదాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దాడిపై ఫిర్యాదు

సత్తెనపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డులో చేపలు అమ్ముకుంటున్న తమ కుటుంబాలపై అదే వార్డుకు చెందిన హుస్సేన్ జానీ, ఆమె కుమారులు తరచూ దుర్భాషలాడుతూ దాడులు చేస్తున్నారని చేపలు అమ్ముకుంటున్న పలు కుటుంబాల సభ్యులు యానాది సంఘ నాయకుడు శివయ్య ఆధ్వర్యంలో శనివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరి ఆగడాలకు భయపడి పది కుటుంబాల వారు వేరే చోట నివాసం ఉంటున్నారు. చేపలు అమ్ముకొనే కుటుంబాలను చేపలు ఎలా అమ్ముతారో చూస్తామని బెదిరిస్తున్నారని శివయ్య తెలిపారు. కులం పేరుతో దూషిస్తూ అవమాన పరుస్తున్న హుస్సేన్ జానీ, ఆమె కుమారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

రాగివైరు, కేబుల్ వైర్లు చోరీ

వెల్దుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్లవీడు గ్రామానికి చెందిన కోనుగంటి శ్రీనివాసరెడ్డికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి రాగివైరుతోపాటు మోటారుకు ఉన్న కేబుల్ వైరును అపహరించారు. దీనిపై బాధితుడు శ్రీనివాసరెడ్డి విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా వారం రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన అక్కెం లింగయ్య ట్రాన్స్‌ఫార్మర్‌ను అపహరించారు. మిర్చి పంటలకు సాగునీరు అవసరమైన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

అమరావతి, మార్చి 15(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని ఎస్‌టీయూ(డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంపీయూపీ స్కూల్లో జరిగిన ఎస్‌టీయూ(డీ) మండల సర్వసభ్య సమావేశంలో కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు ఆనందరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, శివబాబులు సమావేశంలో పాల్గొని మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● చీపురు పట్టి ఊడ్చి శుభ్రం చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా చీపురు పట్టి వ్యర్థాలను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటవీశాఖ క్షేత్రస్థాయి కార్యాలయంలో మొక్కలను పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.



చీపురు పట్టి శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

● అటవీశాఖ క్షేత్రస్థాయి కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎక్కడ అని ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మిని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. కార్యాలయంలో నెలకొన్న అపరిశుభ్రతపై ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జూలకంటి అక్కిరెడ్డి, వజ్రం నాయక్, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అధికారులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో నాగార్జునసాగర్ జలవనరుల శాఖ ఆధ్వర్యాన గ్రామంలోని వాటర్ సప్లయి కార్యాలయం వద్ద శనివారం అధికారులు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు చీపురుపట్టి ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

● **కారంపూడి (ఆంధ్రజ్యోతి):** కారంపూడిలో శనివారం అధికారులు ప్రభుత్వ కార్యాలయాలను ఊడ్చి శుభ్రపరిచారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పలుచోట్ల గ్రామసభలు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో విద్యార్థులచే మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఇన్‌చార్జి ఆర్‌ఐ వేముల శ్రీనివాసరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి (ఆంధ్రజ్యోతి):** మండలంలోని శిరిగిరిపాడులో అధికారులు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి వై జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యాన అధికారులు గ్రామంలో ర్యాలీ జరిపారు. పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● **దుర్గి (ఆంధ్రజ్యోతి):** మండల రెవెన్యూ కార్యాలయం వద్ద అధికారులు చీపుర్లు పట్టి కార్యాలయ పరిసరాల్లోని వ్యర్థాలను ఊడ్చి తొలగించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ తమ్మాజీరావు, తహసీల్దార్ ఫణీంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● **రెంటచింతల (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, టెయిల్ పాండ్ విద్యుత్ కార్యాలయం వద్ద అధికారులు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయాలు పరిసరాలను ఊడ్చి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

● **గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పల్లెగుంత గ్రామంలో ఎంపీడీవో గౌసియాబేగం ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై ఆమె గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. మోడల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుదాం : కమిషనర్ శ్రీధర్

పిడుగురాళ్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిడుగురాళ్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరు పాటుపడాలని కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు, కూటమి నేతలతో కలిసి వీధులను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టడంతో పాటు ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్లలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త చినసుబ్బారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరు తడిపొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిరోధిస్తామని అధికారులు, కౌన్సిలర్లు, కూటమి నేతలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్రరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ పున్నం భారతి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● నేటి నుంచి ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగ్‌లు ఏమైనా విక్రయిస్తే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు షాపును సీజ్ చేస్తామని కమిషనర్ పీ శ్రీధర్ తెలిపారు. శనివారం పట్టణంలో ప్లాస్టిక్ వస్తువులు విక్రయించే పలు దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ వస్తువులను విక్రయించినట్లైతే రూ.25 వేల వరకు జరిమానా విధిస్తాన్నారు.



పిడుగురాళ్లలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వీధులను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీధర్, కౌన్సిలర్లు, కూటమి నేతలు

● **దాచేపల్లి (ఆంధ్రజ్యోతి) :** దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయ వెనుక భాగంగా చెత్తాచెదారాన్ని తొలగించారు. నగర పంచాయతీలో మున్సిపల్ కమిషనర్ అప్పారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

● **మాచవరం (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర గ్రామసభలు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేపట్టారు. కార్యక్రమాలకు మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంగళరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫోన్ కొట్టేశారు.. డబ్బులు కాజేశారు

● ఆలస్యంగా కేసు నమోదు

దాచేపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణం చేస్తున్న వ్యక్తి జేబులో నుంచి ఫోన్ కొట్టేసి.. ఫోన్‌పే ద్వారా నగదును కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. శనివారం దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచర్ల నియోజకవర్గం రెంటచింతలకి చెందిన పాశం ధనుంజయ్ రెడ్డి ఫిబ్రవరి 20వ తేదీన దాచేపల్లి నుంచి రెంటచింతలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులో బయల్దేరాడు. కొంత దూరం వెళ్కాక జేబులో ఫోన్ లేకపోవటాన్ని గుర్తించాడు. వెంటనే ఫోన్ నెంబరును బ్లాక్ చేశారు. మరుసటి రోజు 21వ తేదీన అదే నెంబరుతో కొత్త సిమ్ తీసుకొని మరో కొత్త ఫోన్‌లో సిమ్‌ను వేశారు. అనంతరం ఫోన్‌పేలో ఉన్న నగదును పరిశీలించగా రూ.1.50లక్షలు ఫోన్‌పే ద్వారా ట్రాన్సర్ చేసినట్లుగా గుర్తించాడు. జరిగిన సంఘటనపై దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. సాంకేతిక పరిజ్ఞానంతో డబ్బులను కాచేసినట్టు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య మిత్రలు విధుల బహిష్కరణ

పిడుగురాళ్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17, 24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య మిత్రలు విధులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ వైద్య సేవా ఎంప్లాయిస్ జేఏసీ యూనియన్ నేతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తుందని, ఆప్కాస్ రద్దు దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నందున ఏప్రిల్ నుంచి బీమా పథకం అమల్లోకి రానున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17, 24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య మిత్రలు విధులను బహిష్కరిస్తున్నట్లు పల్నాడు జిల్లా నాయకులు సుధాకర్, శ్రీనివాసరావు, మహాలక్ష్మి తదితరులు తెలిపారు.

పారిశుధ్యం లోపిస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు

● డీఆర్‌డీఏ పీడీ కే హీరాలాల్

నకరికల్లు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి కే హీరాలాల్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం ప్రతి నెలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తురకపాలెం పంచాయతీలో హీరాలాల్ పాల్గొన్నారు. ప్రతి పంచాయతీలో ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంలో ఉన్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీ కాశయ్య, ఈవోఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు, జగదీష్, సర్పంచ్ నాగోతు దాసయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తురకపాలెంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ, కే హీరాలాల్

● **సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి) :** మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ పార్కులో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. పాత బైపాస్ రోడ్డులో వ్యర్థ పదార్థాలను తొలగించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు తాలూకా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధంపై మునిసిపల్ కమిషనర్ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పై మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నెట్టెం సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, తదితరులు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమ ప్రత్యేక పరిశీలకులు పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ భావన, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో భాగస్వాములు కావాలి

● మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాశయ్య

క్రోసూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ఉద్యమంలో సమాజంలోని ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. శనివారం క్రోసూరులో జరిగిన స్వచ్ఛాంధ్ర ర్యాలీ, ఆ తరువాత జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ కొనసాగింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, ఆశావర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

● **అమరావతి (ఆంధ్రజ్యోతి):** స్వర్ణాంధ్ర స్వచ్ఛదివస్‌లో బాగంగా అమరావతిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామాల్లోని పంచాయతీలు, పాఠశాలల్లో పరిసరాల శుభ్రత చేపట్టారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డానియేలు కార్యాలయ ప్రాంగణంలో చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు.



క్రోసూరులో నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర ర్యాలీ

వైభవంగా మత్స్యావతార శ్రీనేతి వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల

రాజుపాలెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన దేవరంపాడు మత్స్యావతార శ్రీనేతి వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి సన్నిధిలో మహిళలు పొంగళ్లు పొంగిచ్చి సమర్పించారు. తిరునాళ్ల సందర్భంగా తహసీల్దార్ దుర్గేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ జానీ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొత్తం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఈవో సురేష్ తెలియజేశారు. తిరునాళ్లను పురస్కరించుకుని అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ వేణుగోపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లో నిలబడిన భక్తులు

ఆలయ హుండీ ఆదాయం రూ.13లక్షల 47వేల 259 వచ్చిందని ఈవో సురేష్‌కుమార్ తెలిపారు.

రికార్డులను పరిశీలించిన ఆర్డీవో మురళీ కృష్ణ

రెంటచింతల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 167 ఏడీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నర్సరీల్లో భూములను కోల్పోయిన రైతులకు ఎంత నష్టపరిహారం చెల్లించాలనే విషయంపై గురజాల ఆర్డీవో మురళీకృష్ణ శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. 787, 788 సర్వే నెంబర్లలో వరుసగా 50, 18 సెంట్ల భూమిని పరిశీలించి రైతులైన రామకృష్ణ, జోసఫ్‌రెడ్డిలతో మాట్లాడారు. రికార్డులను పరిశీలించి మార్కెట్ ధర ఎంత ఉందనే దానిపై సమాచారం సేకరించారు. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామన్నారు.

ఆయన వెంట జిల్లా ఉద్యాన శాఖాధికారి రమణారెడ్డి, ఎనిబెరా మోహన్, తహసీల్దార్ అర్జున్‌నాయక్, ఆర్‌ఐ పల్లా రామకృష్ణ, సర్వేయర్లు రవీంద్రారెడ్డి, నేషనల్ హైవేకు చెందిన శ్రీనివాసరావు, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత సీఎం చంద్రబాబునాయుడు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజా ప్రస్థానంలో తొలిసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి 47 సంవత్సరాలు పూర్తయిందన్నారు. మార్చి 15వ తేదీ 1978లో ఆయన తొలిసారిగా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారని, ఇప్పటికి 47 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. 47 సంవత్సరాల ప్రజాప్రస్థానంలో ఎమ్మెల్యేగా 41 సంవత్సరాలు, ముఖ్యమంత్రిగా 14 సంవత్సరాలు, ప్రతిపక్ష నేతగా 15సంవత్సరాలు పని చేశారన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు రక్షణగా నిలిచారన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చి మహిళా సాధికారితకు కృషి చేస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరేశ్వరుడి సన్నిధిలో జస్టిస్ రజని

అమరావతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ పి.రజని శనివారం సాయంత్రం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాల చాముండికా సమేత అమరేశ్వరాలయంను కుటుంబ సమేతంగా సందర్శించారు. జస్టిస్ రజని దంపతులను ఆలయ మర్యాదలతో అర్చకులు, ఈవో సునీల్‌కుమార్ స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకువెళ్లారు. అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామికి జరిగిన పంచ హారతులను జస్టిస్ రజని దంపతులు తిలకించారు.



రజనికి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

క్రోసూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 15వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 9052969643, 9000877530 నెంబర్లలో సంప్రదించాలని ఆయన చెప్పారు.


శ్రీవారి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు






అమరావతిలో.. శ్రీవారి కళ్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి


వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు


కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు


శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు


సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు


మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు


కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు


కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ


కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు

గడువులోగా రైతుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ ప్రధాన కార్యాలయంలో సమస్యలపై సమీక్ష

ప్రాధాన్య క్రమంలోనే గ్రామ కంఠాల సమస్య పరిష్కారం

● సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి) రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించడానికే సీఆర్డీఏ తొలి ప్రాధాన్యమిస్తుందని సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు అన్నారు. శనివారం విజయవాడ లెనిన్ సెంటర్ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్‌తో కలసి ఆయన గ్రీవెన్స్ పోర్టులో రైతులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో చర్చించారు. గడువులోగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టులో 93 సమస్యలు నమోదు కాగా రైతులందరిని పిలిచి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం జరిగే గ్రీవెన్స్ డే తో పాటుగా ప్రతి శనివారం విజయవాడ సీఆర్డీఏ ఆఫీసులో తానే స్వయంగా సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని కమిషనర్ తెలిపారు. రైతుల నుంచి నేరుగా కాకుండా ఆన్‌లైన్ విధానంలో కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు అందినప్పటి నుంచి అది పరిష్కారమయ్యే దాక ఎప్పటికప్పుడు రైతు ల ఫోన్లకు మేసేజ్ వెళ్తుందని చెప్పారు. పలువురు రైతులు గ్రామ కంఠం భూముల సమస్యల గురించి ప్రస్తావించగా వాటిని ప్రాధాన్య క్రమంలో వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ అధికారులు డీసీలు, తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు సర్వేయర్లు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్

సికింద్రాబాద్‌కు బదులుగా చర్లపల్లికి రైళ్ల మళ్లింపు

విజయవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా తొమ్మిది రైళ్లను దారి మళ్లించి చర్లపల్లి స్టేషన్‌లో నిలిపేందుకు రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పనులను చేపట్టినట్టు వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లాట్‌ఫారం, తదితరాలు రాకపోకలకు అనువుగా లేని కారణంగా రైళ్ల రాకపోకలను చర్లపల్లి నుంచి ఆపరేట్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కామారెడ్డి, వయా మౌలాలి బైపాస్ రూట్ నుంచి డైవర్షన్ అవుతాయని చెప్పారు. రైలు నెం.20809, 20810 శంబల్ పూర్-నాందేడ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25, 26 తేదీల్లో చర్లపల్లిలో ఆగుతాయన్నారు. ఇదే క్రమంలో 20811, 20812 విశాపట్నం-హెచ్ఎస్ నాందేడ్, విశాఖపట్నం ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26, 27 తేదీల్లో చర్లపల్లి నుంచి ఆపరేట్ అవుతాయి. 18503, 18504 విశాఖపట్నం-సాయినగర్ షిరిడీ-విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, 25తేదీల్లో, 12787, 12788 నరసాపూర్-నాగర్‌సోల్-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25, 26 తేదీల్లో చర్లపల్లి స్టేషన్‌లో ఆగుతాయి. 17231, 17232 నరసాపూర్ - నాగర్‌సోల్ - నరసాపూర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 28, 29 తేదీల్లో చర్లపల్లి నుంచి ఆపరేట్ అవుతాయి. సికింద్రాబాద్ - బేగంపేట మీదుగా నడిచే రైళ్లు కొన్ని చర్లపల్లి టూ సనత్‌నగర్, లింగంపల్లి వయా అమ్ముగూడ బైపాస్ రూట్‌లో వెళతాయి. 17208, 17207 సాయినగర్ షిరిడీ-మచిలీపట్నం ఏప్రిల్ 22, 23 తేదీల్లో, 17206, 17205 కాకినాడ పోర్టు-సాయినగర్ షిరిడీ ట్రై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 23, 24 తేదీల్లో, 18519, 18520 విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినల్ ముంబయి-విశాఖపట్నం డైలీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24, 22 తేదీల్లో మౌలాలీ, సికింద్రాబాద్ స్టేషన్లలో ఆగకుండా చర్లపల్లి, సనత్‌నగర్, లింగంపల్లి, వయా అమ్ముగూడ బైపాస్ రూట్‌లో నడుస్తాయన్నారు.

జడ్పీటీసీలు.. బాయ్‌కాట్

(5వ పేజీ తరువాయి)

సంఘ సమావేశాలకు కోరం లేకపోవడంతో వాటిని వాయిదా వేశారు. మధ్యాహ్నం జరి గే సర్వసభ్య సమావేశానికి జడ్పీటీసీలు వస్తారులే అని అందరూ అనుకున్నారు. అయితే మధ్యాహ్నం 2.30 గంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగా అతితక్కువ మందే హాజరయ్యారు. దీంతో తొలుత గంటసేపు వాయిదా వేశారు. అప్పటికే సమావేశా నికి హాజరైన ఎమ్మెల్సీ లక్ష్మణరావు, బాపట్ల జేసీ ప్రభాకర్‌జైన్, పల్నాడు జేసీ సూరజ్‌ధనుంజయ్, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధుల కోసం ఎదురు చూశారు.

ఎమ్మెల్యేలు వస్తారని..

ఎమ్మెల్యేలు సమావేశానికి వచ్చే అవకాశం ఉందని చైర్‌పర్సన్ తొలుత ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలందరూ హాజరైనా కోరం సరిపోతుందని అందరూ ఊహించగా వారు కూడా సమావేశానికి గైర్హాజరయ్యారు. వాయిదా సమయం ముగిసిన తర్వాత కూడా జడ్పీటీసీలు సమావేశానికి హాజరుకాలేదు. జడ్పీలో మొత్తం 82 సభ్యులు ఉండగా(ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు కలిపి) కేవలం 13 మంది మాత్రమే హాజరయ్యారు. కోరం కావాలంటే 27 మంది సభ్యులు ఉండాలి. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్ ప్రకటించారు.

బడ్జెట్ ఆమోదానికి అడ్డంకులు

శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2025-2026 అంచనా బడ్జెట్‌ను ఆమోదించాలి. రూ.643.80 కోట్లతో అధికారులు బడ్జెట్‌ను రూపొందించి ఆమోదం కోసం పాలకవర్గం ముందుకు తీసుకువచ్చారు. బడ్జెట్ ఆమోదం పొందితేనే రానున్న ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయింపు, చెల్లింపులు, ఖర్చులకు అవకాశం ఉంటుంది. అయితే జడ్పీటీసీలు సమావేశానికి రాకపోవడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. ఫలితంగా ఏప్రిల్ 1 నుంచి జడ్పీ చెల్లింపులు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు.


సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా

జడ్పీటీసీల దారిమళ్లింపు..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో వైసీపీకే పూర్తి మెజార్టీ ఉంది. చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా కూడా ఆ పార్టీకి చెందిన వారే కాగా ఎన్నికల ముందు ఆమె భర్తతో కలిసి టీడీపీలో చేరారు. ఆ తర్వాత జరిగిన రెండు సమావేశాలకు జడ్పీటీసీలు హాజరయ్యారు. వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి రాంబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత జడ్పీటీసీలను ఇటీవల జగన్ వద్దకు తీసుకువెళ్లినట్లు సమాచారం. జడ్పీ విషయాల్లో సహాయ నిరాకరణ పాటించాలని జడ్పీటీసీలను జగన్ ఆదేశించినట్లు తెలుస్తుంది. అయినా జడ్పీ సమావేశానికి హాజరయ్యేందుకు జడ్పీటీసీలు సిద్ధం కాగా వారిని వైసీపీ నేతలు పిలిపించి అడ్డుకున్నట్లు సభ్యులు చెబుతున్నారు. వారితో నేతలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అక్కడే భోజనాలు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

గతంలో ఎన్నడూ లేదు...

గతంలో ఎన్నడూ లేని రాజకీయ పోకడ జడ్పీలో కనిపిస్తుంది. ప్రభుత్వాలు మారిన తర్వాత బలాబలాలు అటూఇటూ అయినా ఏ నాడు జడ్పీ సమావేశాలను బహిష్కరించిన దాఖలాలు లేవు. సమావేశాలకు జడ్పీ టీసీలు హాజరై సమస్యలపై నిలదీసేవారు. ప్రస్తుతం ఆ సంప్రదాయం మంటగలిసిందని ఇలా సమావేశాలు బాయ్‌కాట్ చేస్తే ప్రజా సమస్యల పరిష్కారం ఎలా అన్న ప్రశ్న ఎదురవుతోంది. దళిత మహిళ చైర్‌పర్సన్‌గా ఉండగా వైసీపీ ఇటువంటి రాజకీయ ఎత్తుగడలు వేయడం విమర్శలకు తావిస్తోంది. హెనీక్రిస్టీనా టీడీపీలోకి మారిన తర్వాత జరిగిన తొలి సమావేశంలో కూడా వైసీపీ ఇదే రీతిగా వ్యవహరించి విమర్శలు ఎదుర్కొన్నది. బడ్జెట్ ఆమోదంపై ఏర్పాటు చేసిన కీలక సమావేశంలోనూ అదే పంథాను ఎంచుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

మిర్చిలో అధిక మోతాదులో నెమ్ము శాతం

● ఆర బెట్టకుండా తీసుకొస్తున్న బళ్ళారి, హుబ్లీ, హోస్‌పేట రైతులు

● వాటి శాంపిల్స్ చూస్తూనే ఎగుమతిదారుల వెనకడుగు

● ధర పెరగకపోవడానికి ఇదే ప్రధాన కారణం

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్న ఎండుమిరపకాయలలో నెమ్ము శాతం ఎక్కువ మోతాదులో ఉంటున్నది. పంట కోసిన తర్వాత కనీసం 20 రోజుల పాటు కళ్ళాల్లో ఎండబెట్టి తీసుకురావాల్సిన ఆ రాష్ట్ర రైతులు 10 రోజులకే తీసుకొస్తున్నారు. కొందరైతే కోసిన రోజునే కాయలు తీసుకొస్తున్నారని వ్యాపారస్థులు, అధికారులు చెబుతున్నారు. యార్డుకు నిత్యం 1.50 లక్షల నుంచి 1.80 లక్షల మిర్చి టిక్కీలు(40 కేజీలవి) వస్తుండగా వాటిల్లో 80 నుంచి 85 శాతం వరకు నెమ్ము అధిక మోతాదులో ఉంటుందని చెబుతున్నారు. ఇది ప్రత్యక్ష్యంగా ధరలు పెరగకపోవడానికి కారణంగా మారుతున్నది. తేమ శాతం తక్కువగా ఉన్న మిరపకాయలు వస్తుంటే ఈ పాటికే క్వింటాల్ ధర రూ. 16 వేలకు చేరుకొని ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

రెండు వారాల క్రితం సీఎం చంద్రబాబు వద్ద మిర్చి వ్యాపారస్థులతో సమావేశం జరిగిన తర్వాత ధర క్వింటాల్‌కు రూ. 15 వేల వరకు చేరుకొన్నది. ఇక రైజింగ్ అవుతుందని అంతా భావించారు. ప్రభుత్వం కూడా మిర్చికి కనీస మద్దతు ధర ప్రకటించడంతో వ్యాపారస్థుల్లో పోటీ తలెత్తుతుందని, దాంతో రైతులకు మేలు జరుగుతుందని అంచనా వేశారు. అయితే కర్ణాటకలోని బళ్ళారి, హోస్‌పేట, హుబ్లీ నుంచి రైతులు తీసుకొస్తున్న మిర్చి టిక్కీలలో నెమ్ము శాతం అధికంగా ఉండటమే కాకుండా తాలు కూడా ఎక్కువ మోతాదులో ఉంటుంది. దాంతో ఎగుమతిదారులు పోటీపడి వాటిని కొనుగోలు చేయడం లేదు. దీంతో ధర తగ్గుతున్నది. ప్రస్తుతం వివిధ రకాల మిర్చి సగటు ధర రూ. 12 వేల నుంచి రూ. 13 వేల మధ్యనే ఉంటున్నది. కొన్ని టిక్కీలు అమ్ముడుపోకపోతుండటంతో రైతులు కమీషన్ వ్యాపారస్థుల దుకాణాల వద్దనే ఆరుబయట ఆరబోస్తున్నారు. దీని వలన యార్డులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నది.


నెమ్ము శాతం అధికంగా ఉండటంతో యార్డులోనే మిర్చిని ఎండబోసిన రైతులు

20 రోజులైనా ఎండబెట్టుకుని తీసుకురావాలి
ఏ చంద్రిక, మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి



ఈ విషయం మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకు కమీషన్, ఎగుమతి వ్యాపారస్థులు నివేదించడంతో ఆమె మూడు రోజుల నుంచి అధికారులను ఆయా దుకాణాల వద్దకు పంపించి పరిశీలన చేయించారు. కర్ణాటక రైతులు తీసుకొస్తున్న మిర్చిలో ఎక్కువగా తేమ శాతం ఉందని అధికారులు నివేదిక ఇవ్వడంతో సెక్రెటరీ మైకులో రైతులకు విజ్ఞప్తి చేయించారు. మిర్చిని పొలం వద్దనే కనీసం 20 రోజులు ఎండబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. అప్పుడు అధిక ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలా తగినంత ఆరబెట్టకుండా తీసుకురావడం వలన అది మార్కెట్‌పై ప్రభావం చూపుతుందని చెప్పారు. ఈ విషయాన్ని రైతులంతా గమనించాలని విజ్ఞప్తి చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

విజనరీ లీడర్ తొలి ప్రమాణ స్వీకారానికి 47 ఏళ్ళు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): దార్శనికుడు, విజనరీ లీడర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1978 మార్చి 15న తొలిసారి శాసనసభలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి 47 ఏళ్ళు పూర్తైందని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయానికి పెట్టింది పేరు చంద్రబాబునాయుడు అని, దానికి ఉదాహరణ విజన్ 2020 కల సాకారమై, ఐటీ రంగాన్ని తీసుకువచ్చి లక్షలాది ఉద్యోగాలు కల్పించి సంపద సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నేడు స్వర్ణాంధ్ర విజన్ 2047 పేరుతో పౌరుల తలసరి ఆదాయాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నారన్నారు. మహిళల స్వావలంబన ఉద్దేశంతో రాష్ట్రంలో తొలిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటుచేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను రాష్ట్ర ప్రజలందరికీ సమపాళ్ళలో అందిస్తున్నారని కొనియాడారు.



స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల

ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలి

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల

రొంపిచర్ల, మార్చి 15(ఆంధ్రజోతి): ప్లాసిక్ వాడకాన్ని నిలిపివేయాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు శనివారం ప్రజలను కోరారు. మండలంలోని రొంపిచర్ల గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. దేవాలయాలు, ప్రధాన వీధులు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సూర్యప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో మాథ్యూబాబు, ఈవోపీఆర్‌డీ సతీష్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరేపల్లిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

రొంపిచర్ల, మార్చి 15(ఆంధ్రజోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామంలో విద్యార్థులకు రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ అయోడిన్ లోప రుగ్మత నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ రాజరాజేశ్వరి కార్యక్రమంలో పాల్గొన్నారు. అయోడిన్, మూత్రం, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. 90మంది విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన కృష్ణవేణి విద్యార్థులు

నరసరావుపేట టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫస్ట్‌సోర్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 49మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైనవారు డిగ్రీ పూర్తయిన వెంటనే విధులలో చేరాల్సి ఉంటుందని హెచ్‌ఆర్ అనిల్ తెలిపారు. ఎంపికైనవారిని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డీ యోగేశ్వరరావు, టీపీవో ఎం బాలకోటేశ్వరరావు, జీ శివన్నారాయణ అభినందించారు.

ఒబన్న విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

● టీడీపీ బీసీ సెల్ జిల్లా నాయకుడు నరసింహారావు

నరసరావుపేట టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మాచర్లలో 16వ తేదీన నిర్వహించే వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా నాయకుడు తిరుమలకొండ నరసింహారావు కోరారు. శనివారం నరసరావుపేట టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి, టీడీపీ వడ్డేర సాధికార సమితి నాయకుడు కనిగిరి బాలమురళీకృష్ణ, బత్తుల శివయ్య, పట్టణ వడ్డెరసంఘం అధ్యక్షుడు కుంచాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన గుళికల తయారీపై అవగాహన పెంచుకోవాలి

● ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

నరసరావుపేట రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులలో భూమిని కప్పి ఉంచే విధానంలో భాగంగా విత్తన గుళికల తయారీపై అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మూడు రోజులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం మూడో రోజు అవగాహన కలిగించారు. వేసవికాలంలో ప్రతి రైతు తన కున్న విత్తనగుళికల విధానం ఆచరించటం ద్వారా భూమిలో ఉన్న తేమశాతం, కార్బన్‌శాతం ఆవిరి కాకుండా ఉంటుందని అమలకుమారి తెలిపారు. కార్బన్ శాతం పెరగటం వలన తర్వాత వేయబోయే ప్రధాన పంట మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. జిల్లా శిక్షణ అధికారి సైదయ్య, నందకుమార్, అప్పలరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

● సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అరికట్టాలి

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం కోసం.. ప్రజలందరి ఆరోగ్యం కోసం పరిశుభ్రతను పాటించడంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక 27వ వార్డు హనుమాన్‌నగర్ ప్రాథమిక పాఠశాల వద్ద మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ వినుకొండ కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 నాటికి ఆ చెత్త మొత్తం శుభ్రం చేయడం, వ్యర్థాలను సంపదగా సృష్టించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ



బొల్లాపల్లి: వెల్లటూరులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రవి బాబు

స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు

వినుకొండటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరగాయపాలెం గ్రామంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి కందుల శ్రీరాములుతో పాటు మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని, ప్లాస్టిక్ వినియోగం ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌నాయక్, ఎంపీడీవో పుట్టారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తిమ్మాయపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ర్యాలీ నిర్వహించారు.

పచ్చదనమే ప్రగతి..

బొల్లాపల్లి, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు సచివాలయంలో మండల స్పెషల్ అధికారి రవిబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యక్రమంలో ఎంపీడీవో వీ సీతారామయ్య, ఏవో అంకారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ చినవీరయ్య, టీడీపీ నాయకులు వి.తిరుపతిరావు, ఏ శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, సచివాలయసిబ్బంది ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

నూజెండ్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మండల స్పెషల్ అధికారి వీ సుబ్బారావు అన్నారు. శనివారం నూజెండ్లలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీ సుబ్బారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ పాత్రలు, ఆహారంలో కల్తీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ తన కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఎంఈవో ఎన్ రవిచంద్ర, ఏపీవో అంజనేయరాజు, వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. పెద్దవరంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించిన ప్రత్తిపాటి



ఫిర్యాదులను అందుకుంటున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలో పలు సమస్యలకు సంబంధించి ఫిర్యాదులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం మునిసిపల్ కౌన్సిల్ హాలులో ప్రజల నుంచి స్వీకరించారు. రోడ్లపై గుంతలు, కాల్వల నిర్మాణం, తాగునీటి సరఫరా, చేపల మార్కెట్ ఏర్పాటు, వీధికుక్కల బెడద తదితర సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు వచ్చాయి. సమస్యల పరిష్కారం విషయమై వెంటనే అధికారులతో ఆయన మాట్లాడారు. కౌన్సిలర్లు, అధికారులు వారానికోసారి వార్డుల్లో పర్యటించి, ప్రజలకు అందుతున్న సేవల్ని పరిశీలించి, వారి సమస్యలు తెలుసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. చేపల మార్కెట్ నిర్మాణ ప్లాన్ త్వరగా సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. శివారు కాలనీలకు తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పట్టణంలో వీధి కుక్కల సంచారం లేకుండా చూడాలన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీం, అర్బన్ సీఐ పి.రమేష్ బాబు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నరసరావుపేట రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం నీలావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షల విధుల్లో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు ఏప్రిల్ ఒకటో తేదీ నుండి ప్రారంభమవుతాయని ఆమె తెలిపారు. 10వ తరగతి పరీక్ష రాసి పాసైన విద్యార్థులకు ప్రథమ ఇంటర్‌లో ప్రవేశం పొందుటకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

డీపీవో విజయభాస్కరరెడ్డి



పంచాయతీ కార్యదర్శికి సూచనలిస్తున్న డీపీవో విజయభాస్కరరెడ్డి

యడ్లపాడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే వాటిల్లో ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమైనదని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి సూచించారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం మండలంలో ప్లాస్టిక్ వినియోగం.. అనర్థాలపై అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యడ్లపాడు గ్రామాన్ని సందర్శించిన డీపీవో గ్రామంలో పర్యటించారు. జాతీయరహదారి, సర్వీసు రోడ్డు పక్కన వ్యర్థాలు పోగుపడడాన్ని గమనించి వెంటనే తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పర్యావరణానికి హాని కలిగించని కాగితం కవర్లు, సంచులు వినియోగించాలన్నారు. యడ్లపాడు, ఉన్నవ, వంకాయలపాడు గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో హేమలతాదేవి పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతోపాటు గ్రామాల్లోని ప్రధానవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ జాకీర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి శశికళ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి నష్టం

నాదెండ్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి నష్టం కలిగించటంతో పాటు మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి సంజీవరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూబాడు గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం వల్ల ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి, గ్రామ సర్పంచ్ గోళ్ళమూడి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకం విధి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి, సౌరవిద్యుత్ వినియోగంలో చిలకలూరిపేట రాష్ట్రంలోనే ముందుండేలా అధికారులు కృషిచేయాలని శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో భాగంగా ఇంటిపైన సోలార్ ప్యానెళ్లు ఏర్పాటుచేసే దిశగా ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి ఉచితంగా ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాయన్నారు. బీసీలకు కేంద్రం ఇచ్చే రాయితీకి తోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు ఇవ్వనుందన్నారు.

కూటమి ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు న్యాయం

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో నాయీ బ్రాహ్మణులు ఎంతో సంతోషంగా ఉన్నారని, అన్ని విధాలా న్యాయం జరుగుతున్నదని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ శనివారం అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పలకలూరి వెంకటేశ్వర్లు, అట్లూరి శ్రీనివాసరావు, గుంటుపల్లి కోటేశ్వరరావు, ఆర్ ఏడుకొండలు, మార్ధూరి శ్రీనివాసరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, నాదెండ్ల శీను, అనంతవరం శివన్నారాయణ, సుందర్రావు, ఆదిబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

సెలవు రోజు పన్ను చెల్లింపుల కోసం ప్రత్యేక కౌంటర్లు

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సెలవు రోజు అయినప్పటికీ ఆదివారం ప్రజలు తమ ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుకోసం స్థానిక మునిసిపాలిటీ ఆవరణలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7వరకు ఈ కౌంటర్లు పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు.

చిలకలూరిపేట కొమ్మినేని ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలోని కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఢిల్లీలోని నేషనల్ అక్రిడేషన్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ సంస్థ గుర్తింపు లభించింది. ఉన్నత ప్రమాణాలు, సురక్షిత విధానాలు, నాణ్యమైన వైద్య సేవలను అందించే ఆసుపత్రులకు ఈ విధమైన జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుంది. ఈ గుర్తింపు లభించడం పట్ల ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావు, ఇతర వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొమ్మినేనిని పట్టణానికి చెందిన పలువురు వైద్యులు అభినందించారు.

18న చిలకలూరిపేటలో జాబ్ మేళా

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న పట్టణంలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు శనివారం తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదివిన 18-35 ఏళ్ల వయసుగల నిరుద్యోగ యువతీ యువకులు అన్ని సర్టిఫికెట్లతో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 91005 66581, 73306 98119 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రతిభ చూపిన గణపవరం విద్యార్థులు

నాదెండ్ల, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో గల కెల్లంపల్లి భద్రాచలం ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వపోటీల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా వీరిని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్ బాజీబాబు, హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్ తదితరులు అభినందించారు.

ప్రతి పేదవాడికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి: ముప్పాళ్ల

నరసరావుపేట టౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేదవాడికి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇళ్ళస్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం నరసరావుపేట సీపీఐ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సీపీఐ శ్రేణులు, ఇళ్ళస్థలాల అర్జీదారులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించి అర్హులకు పంపిణీ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబుకు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, జిల్లా కమిటీసభ్యుడు బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు ఉలవలపూడి రాము, చిలకలూరిపేట నియోజవర్గ ఇన్‌చార్జి తాళ్ళూరి బాబురావు, మాచర్ల సీపీఐ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, పెదకూరపాడు కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ళ తదితరులు

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ చిలకలూరిపేట సాకారం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



జూట్ సంచులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే స్వచ్ఛ చిలకలూరిపేట సాకారమవుతుందని, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్లో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం వల్ల కలిగే అనర్థాలు వివరించి, ప్రజలకు స్వయంగా జూట్ సంచులు పంపిణీ చేశారు. స్థానిక గాంధీపార్క్ ఆవరణలో చెత్తను తొలగించడంతోపాటు, స్థానిక మార్కెట్లో, వ్యర్థాలను రోడ్లపై వేయడంవల్ల కలిగే అనర్థాలను వ్యాపారులు, ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ప్లాస్టిక్ వాడకాన్ని దశలవారీగా తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ దిశగా పట్టణ మున్సిపల్, పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. డ్వాక్రా, మెప్మా సిబ్బంది ప్రజలతో మాట్లాడి, స్వచ్ఛ చిలకలూరిపేట లక్ష్యాలను వారికి వివరించాలన్నారు. ప్రజలు సహకరిస్తే రాష్ట్రంలోనే చిలకలూరిపేట మున్సిపాలిటీ స్వచ్ఛాంధ్రలో అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. పచ్చదనానికి కూడా మున్సిపల్ అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్లు, డ్రైనేజీల్లో చెత్త లేకుండా చూడాలని, దోమల నివారణపై దృష్టిపెట్టాలని మున్సిపల్ అధికారుల్ని ఆయన ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించి పోలీస్ వారికి సహకరించాలని ప్రత్తిపాటి సూచించారు. మున్సిపల్ చైర్మన్ షేక్‌రఫానీ, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీం, అర్బన్ సీఐ పి. రమేష్‌బాబు పాల్గొన్నారు.



వినుకొండ పశువైద్యశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర నాయుడు

పశుసంవర్ధక శాఖ కార్యక్రమాల్లో రైతులను భాగస్వామ్యం చేయాలి

● పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదరనాయుడు

వినుకొండటౌన్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదరనాయుడు వినుకొండ ప్రాంతంలోని పశువైద్యశాలను శనివారం తనిఖీ చేశారు. వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం, 2024 పశు గణాంకాల వివరాలు, పశుబీమా ప్రగతి, బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు, పశువ్యాధి నిర్ధారణ వంటి వివరాలతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. పశుసంవర్ధక శాఖ కార్యక్రమాలను రైతులకు సక్రమంగా అందజేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, పశువైద్యశాల సహాయసంచాలకులు డాక్టర్ బి.సరోజాదేవి, మండల పశువైద్యశాఖ అధికారి డాక్టర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

వినుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన బాలికల హాస్టల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు మానవ సేవాసమితి ఆధ్వర్యంలో పరీక్షా కిట్లను శనివారం పంపిణీ చేశారు. విద్యానగర్‌లోని గిరిజన ప్రభుత్వ పాఠశాలనందు పదో తరగతి విద్యార్థులకు అవసరమయ్యే ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పి.వి.సురేష్, సెక్రటరీ భవానిశంకర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, హెచ్‌ఎం సరస్వతి, భాగవతుల రవికుమార్ పాల్గొన్నారు.

వసతి గృహాల విద్యార్థులకు...

ఈపూరు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈపూరు ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలలోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని కానిస్టేబుల్ బీ ఆంజనేయులు శనివారం పంపిణీ చేశారు. హాస్టల్ లో ఉంటూ హైస్కూల్‌లో చదువుకుంటున్న 40మంది విద్యార్థులకు సొంత ఖర్చులతో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్లు వీ వెంకటేశ్వరరావు, ఎం శివరామప్రసాదు, హోంగార్డ్ బీసపోగు ఆంజనేయులు పాల్గొన్నారు.

మర్కస్ మసీద్ ఆవరణలో ఇఫ్తార్ విందు

వినుకొండ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాసాలను పురస్కరించుకొని పట్టణంలోని మర్కస్ మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ఉపవాసం ఉన్న ముస్లింలకు భోజనాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులందరూ రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దైవ ప్రవక్త బోధించిన విషయాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి జానీతోపాటు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.